

## బీఆర్ఎస్ విజయాలు కాంగ్రెస్ ఖాతాలోనా?

- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పాలనలో ఎంఎస్ఎంఈలు ఎంతో అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలిచాయని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడ్డా.. రాష్ట్రంలో అనుసరించిన టీఎస్ఐపాస్ లాంటి విధానాలు ఎంఎస్ఎంఈలను దృఢంగా నిలిపాయని బుధవారం ఎక్స్ వేదికగా తెలిపారు. పెట్టుబడుల్లో 115 శాతం పెరుగుదలతో దేశంలో అగ్రగామిగా నిలవడమే కాక.. ఉద్యోగాల కల్పనలో 20శాతం వృద్ధిరేటు సాధించిందని చెప్పారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ మహిళలకు 30శాతం ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బీఆర్ఎస్ పాలనలో సాధించిన ఘనతను వారి ఖాతాలో వేసుకుంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎంఎస్ఎంఈ అభివృద్ధికి తాము చేసిన కృషి ఏమిటో, భవిష్యత్తు కార్యాచరణ ఏమిటో చెప్పకుండా గత ప్రభుత్వ విజయాలతో కాలం గడపడం శోచనీయమని మండిపడ్డారు.

## 10 లక్షల కోట్లకు పన్ను వసూళ్లు





న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.9.95 లక్షల కోట్ల అడ్వాన్స్ ట్యాక్స్ వసూలయ్యాయి. అలాగే రూ.2.05 లక్షల కోట్లు రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది. క్రితం ఏడాది ఇదే సమయంలో చెల్లించిన దాంతో పోలిస్తే 56.49 శాతం అధికం. ప్రస్తుతేడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 17 వరకు పన్ను వసూళ్లలో నికర వ్యక్తిగత ఆదాయ పన్ను 19 శాతం ఎగబాకి రూ.5.15 లక్షల కోట్లకు చేరుకోగా, కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు 10.55 శాతం ఎగబాకి రూ.4.52 లక్షల కోట్లకు, సెక్యూరిటీస్ ట్రాన్సక్షన్ ట్యాక్స్ నుంచి రూ.26,154 కోట్ల ఆదాయం సమకూరింది.

## భెల్ 55 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ప్రభుత్వరంగ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్) గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ రూపంలో రూ.55 కోట్లు చెల్లించింది. ఇందుకు సంబంధించి చెక్‌ను కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి భెల్ సీఎండీ కే సదాశివ్ మూర్తి బుధవారం అందచేశారు. 2023-4 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.87 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది.

## జైత్రయాత్రకు బ్రేక్

### సెన్సెక్స్ 113, నిఫ్టీ 41 పాయింట్ల పతనం

ముంబై, సెప్టెంబర్ 18: స్టాక్ మార్కెట్ల జైత్రయాత్రకు బ్రేక్‌పడింది. గత కొన్ని రోజులుగా రికార్డుల మీద రికార్డులు సృష్టించిన సూచీలు జారుకున్నాయి. ప్రారంభంలో చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న సూచీలు చివర్లో ఐటీ షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో నష్టాల్లోకి పడిపోయింది. వడ్డీరేట్ల తగ్గింపుపై అమెరికా ఫెడరల్ రిజర్వు తీసుకునే నిర్ణయంపై మదుపరులు వేచిచూసే ధోరణి అవలభించారు. దీంతో ప్రారంభంలో 246 పాయింట్లు పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 83 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 131.43 పాయింట్లు కోల్పోయి 82,948.23 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 41 పాయింట్లు నష్టపోయి 25,377.55 వద్ద స్థిరపడింది.

### ఐటీ కంపెనీల షేర్లు కుదేలు

ఐటీ సంస్థల షేర్లు కుదేలయ్యాయి. ఐటీ దిగ్గజమైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 3.49 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు హెచ్‌సీఎల్ టెక్ 3.15 శాతం, ఇన్ఫోసిస్ 3.09 శాతం, టెక్ మహీంద్రా 2.79 శాతం నష్టపోయాయి. వీటితోపాటు సన్‌ఫార్మా, టాటా స్టీల్, టాటా మోటర్స్, టైటాన్, ఏషియన్ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, రిలయన్స్, ఎన్టీపీసీ, ఎయిర్‌టెల్, మారుతి, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, నెస్లే, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్‌లు లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ 3 శాతం, టెక్నాలజీ 2.43 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 1.12 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్, మెటల్, కమోడిటీస్ షేర్లు నష్టపోగా..ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగ సూచీ లాభాల్లో ముగిసింది.

# కేసీఆర్ హయాంలోనే పారిశ్రామిక పరుగులు

### పదేండ్లలో ఎంఎస్ఎంఈల వృద్ధి 15 శాతం

### ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో వెల్లడి

### కరోనా తర్వాత మూతపడిన యూనిట్లు తెలంగాణలోనే అతి తక్కువ అని స్పష్టీకరణ





హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో ప్రగతి సాధించినట్టు ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఎంఎస్ఎంఈ పాలసీలో వివరించింది. టీఎస్ ఐపాస్ ద్వారా ఎంఎస్ఎంఈల నమోదు ప్రక్రియ అత్యధికంగా జరిగినట్టు వెల్లడించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వృద్ధిరేటు ఎంతో మెరుగ్గా ఉన్నదని తెలిపింది. ఎంఎస్ఎంఈల సగటు పెట్టుబడి రూ.2.15కోట్లకు పెరిగినట్టు పేర్కొంది. తరచూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిందించే రాష్ట్ర సర్కారు, పరిశ్రమల అభివృద్ధిలో కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలను ఒప్పుకోక తప్పలేదు. ఎంఎస్ఎంఈ పాలసీలో గత ప్రభుత్వం సాధించిన ప్రగతిని అంకెలతో సహా వివరించింది. టీజీ-ఐపాస్ పోర్టల్‌లో నమోదైన కొత్త ఎంఎస్ఎంఈ యూనిట్లను పరిశీలిస్తే, గడిచిన పదేండ్లలో వరుసగా వృద్ధి నమోదైంది. పదేండ్లలో 11.15 శాతం నుంచి 15 శాతం వరకు వృద్ధి నమోదైనట్టు ప్రభుత్వం వివరించింది. నేడు తెలంగాణలో ఎంఎస్ఎంఈల సంఖ్య 26 లక్షలుగా ఉన్నదని వెల్లడించింది. సగటు పెట్టుబడులు కూడా 115 శాతం పెరిగినట్టు తెలిపింది. ఎంఎస్ఎంఈలో ఉపాధి అవకాశాలు 20 శాతం పెరిగినట్టు, ఎస్సీ, ఎస్టీలు 30శాతం ఎంఎస్ఎంఈల్లో ఉపాధి పొందినట్టు స్పష్టం చేసింది. కొవిడ్ కారణంగా దేశవ్యాప్తంగా పరిశ్రమలు పెద్ద ఎత్తున మూతపడినా తెలంగాణలో మాత్రం ఆ సంఖ్య నామమాత్రంగా ఉండడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన పారిశ్రామిక అనుకూల విధానాలతో పరిశ్రమలు కొవిడ్ తర్వాత త్వరగా కోలుకున్నాయి.

**గడచిన పదేండ్లలో 11.15 శాతం పెరిగిన ఎంఎస్ఎంఈలు (టీఎస్ ఐపాస్ పోర్టల్‌లో నమోదు)**

| ఆర్థిక సంవత్సరం | పరిశ్రమలు |
|---|---|
| 2014-15 | 151 |
| 2015-16 | 1343 |
| 2016-17 | 1606 |
| 2017-18 | 2587 |
| 2018-19 | 2606 |
| 2019-20 | 2869 |
| 2020-21 | 3309 |
| 2021-22 | 3974 |
| 2022-23 | 3061 |
| 2023-24 | 2622 |

### చేయూతనందించి యూనిట్ల పునరుద్ధరణ

బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకొల్పిన తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ (టీఐహెచ్‌సీఎల్) నష్టాల్లో కూరుకుపోయిన 1340 యూనిట్లకు సహకారం అందించడమే కాకుండా మూతపడిన 115 యూనిట్లను పునరుద్ధరించింది. తెలంగాణ పదేండ్లలో పారిశ్రామిక రంగంలో ఇతర రాష్ట్రాల కన్నా శరవేగంగా వృద్ధి సాధించినట్టు ప్రభుత్వం పేర్కొంది. పరిశ్రమల కోసం జరిపే భూముల కొనుగోలులో స్టాంప్ డ్యూటీ మినహాయింపును యథావిధిగా కొనసాగించడంతో పాటు టీ-ప్రైడ్, టీ-ఐడియా పథకాల రాయితీలను స్వల్పంగా పెంచారు. కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన టీఎస్ ఐపాస్ వంటి సింగిల్ విండో విధానం, స్నేహపూర్వక విధానాలు, నిరంతర విద్యుత్తు సరఫరా తదితర అనేక కారణాలతో తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగంలో ప్రముఖంగా ఎదిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పకనే చెప్పింది.

**కరోనాతో 2020-23మధ్య రాష్ట్రాలవారీగా మూతపడిన ఎంఎస్ఎంఈ యూనిట్లు**

| రాష్ట్రం | మూతపడిన యూనిట్లు |
|---|---|
| తెలంగాణ | 231 |
| గుజరాత్ | 1626 |
| హర్యానా | 558 |
| కర్ణాటక | 804 |
| మహారాష్ట్ర | 5082 |
| తమిళనాడు | 2456 |

**తెలంగాణలో పనిచేస్తున్న, నమోదు చేసుకున్న ఎంఎస్ఎంఈల సంఖ్య..**

| సర్వే | ఎంటర్‌ప్రైజ్ స్వభావం | సూక్ష్మ | చిన్న | మధ్యతరహా | మొత్తం |
|---|---|---|---|---|---|
| జాతీయ నమూనా సర్వే | తయారీ, సేవలు, రిటైల్, హోల్‌సేల్ | 25,94,000 | 10,000 | 1,000 | 26,05,000 |
| ఉద్యమ్ నమోదు | తయారీ, సేవలు, రిటైల్, హోల్‌సేల్ | 8,64,202 | 26,560 | 3,028 | 8,93,790 |
| జీవోటీజీ, 2023 | తయారీ, సేవలు | 34,953 | 18,394 | 1,411 | 54,758 |
| టీజీ ఐపాస్ నమోదు | తయారీ, సేవలు | 15,434 | 6,106 | 666 | 22,206 |

# దాచేస్తే దాగని ప్రగతి

- కేసీఆర్ చరిత్రను చెరిపేయాలనుకోవడం భ్రమే
- టీఎస్-ఐపాస్‌తో రాష్ట్ర పారిశ్రామికం పరుగులు
- కాంగ్రెస్ సర్కార్ లెక్కలే నిదర్శనం
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పదేండ్ల కేసీఆర్ పరిపాలనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి పరుగులు పెట్టిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అది తాను చెబుతున్నది కాదని స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా లెక్కలతో సహా వివరించిందని ఆయన ఉదహరించారు. కేసీఆర్‌పై బురద చల్లాలని ఆరోపణలు చేసినప్పటికీ సాధ్యపడలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తక్కువ చేసి చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ప్రయత్నించినప్పటికీ కుదరలేదన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎంఎస్ఎంఈ పాలసీలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తావించిన పలు అంశాలను ఆయన గుర్తుచేశారు.

### గత పదేండ్లలో వృద్ధిరేటుకు సాక్ష్యాలివీ..

గత పదేండ్లలో ఎంఎస్ఎంఈల వృద్ధిరేటు 11 శాతం నుంచి 15 శాతం ఉందని కాంగ్రెస్ ప్రభుత్వమే ఒప్పుకున్నట్టు కేటీఆర్ తెలిపారు. 2018-2023 మధ్యలో టీఎస్-ఐపాస్ ద్వారా పెరిగిన సగటు పెట్టుబడులు 115 శాతం అవగా, జీఎస్డీపీలో ఎంఎస్ఎంఈల వాటా 10 శాతం వృద్ధి చెందిందని వివరించారు. దీన్నిబట్టి ఏటా ఎంఎస్ఎంఈల సంఖ్య 15 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈల కారణంగా ఉపాధి 20 శాతం పెరిగిందని, ఎస్సీ, ఎస్టీ మహిళలు 30 శాతం ఉద్యోగాలు పొందారని వివరించారు. ఇవి బీఆర్ఎస్ లెక్కలు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన లెక్కనేనని కేటీఆర్ వెల్లడించారు. టీఎస్-ఐపాస్ వంటి ప్రగతిశీల విధానాలు, చిన్న పరిశ్రమలకు ఇచ్చిన ప్రోత్సాహకాలతోనే ప్రగతి సాధ్యమైందన్నారు. కేసీఆర్‌ను తక్కువ చేయాలనుకొని కురచ బుద్ధితో విమర్శలు చేసినంత మాత్రాన నిజాలు దాగవని చురకలంటించారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అన్నదెంత నిజమో.. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నది కూడా అంతే నిజమన్నారు.





ఎంఎస్ఎంఈ పాలసీని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు

# వడ్డించిన విస్తరి

- పరిశ్రమల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం
- ప్రోత్సాహకాలపై గత ప్రభుత్వ విధానాలు కొనసాగిస్తాం
- ఎంఎస్ఎంఈ పాలసీ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ వడ్డించిన విస్తరిలా ఉన్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చైనాకు ప్రత్యామ్నాయం భారత్ అయితే, భారత్‌కు ప్రత్యామ్నాయం తెలంగాణ అని చెప్పారు. ప్రోత్సాహకాల విషయంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాలసీ-2024ను సీఎం బుధవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి ఔటర్ రింగురోడ్డు ఎంతగానో తోడ్పడుతున్నదని, ఓఆర్ఆర్‌కు సమాంతరంగా రీజనల్ రింగురోడ్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఔటర్‌ను ట్రిపుల్‌ఆర్‌ను అనుసంధానం చేసేలా రేడియల్ రోడ్లను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. లక్షల ఎకరాల భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా, ఉత్పత్తులు పెంచేలా మౌలిక సదుపాయాలను పెంచుతున్నామని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన విద్యుత్తు, నీరు, అందిస్తామని, భూములు సమకూర్చుతామని, భూములు కోల్పోతున్న రైతులను అందులో భాగస్వాములను చేస్తామని చెప్పారు. పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దళితులు పారిశ్రామికవేత్తలుగా రాణించేందుకు అవసరమైన సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో లైఫ్‌సైన్సెస్, ఫార్మా పరిశ్రమలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఎంఎస్ఎంఈ పాలసీలోని ప్రధానాంశాలు:**

- ప్రభుత్వం ఏర్పాటుచేసే పారిశ్రామిక పార్కుల్లో 20 శాతం ప్లాట్లు ఎంఎస్ఎంఈలకు రిజర్వ్.
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 10 పారిశ్రామికవాడల ఏర్పాటు. ఇందులో 5 ఎంఎస్ఎంఈ పార్కులు. వీటిలో ఒకటి మహిళలకు ప్రత్యేకం.
- ఎంఎస్ఎంఈ పార్కులో 5 శాతం ప్లాట్లు మహిళలకు, 15 శాతం ఎస్సీ, ఎస్టీలకు.
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య పారిశ్రామిక, వాణిజ్య, మిశ్రమ భూవినియోగ జోన్లు. పెరి-అర్బన్ ప్రాంతాల్లో మరిన్ని గ్రీన్, ఆరెంజ్ ఎంఎస్ఎంఈలకు అనుమతి.
- భూమి కొనుగోలుపై ఎస్సీ, ఎస్టీలకు రాయితీ 33 శాతం నుంచి 50 శాతానికి పెంపు. గరిష్ఠ రాయితీ పరిమితి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంపు.
- ప్రైవేట్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల అభివృద్ధికి ప్రోత్సాహం. అందులో 20 శాతం ఎంఎస్ఎంఈలకు.
- పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లో ప్రైవేట్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం. మహిళల యాజమాన్యంలోని ఎంఎస్ఎంఈలకు 10 శాతం అదనపు రాయితీని 20 శాతానికి పెంపు. గరిష్ఠ పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు.
- పరిశ్రమలు ఎక్కువగా ఉన్న 10 జిల్లాల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు.

PURE ELECTRIC VEHICLE

## ఐపీవోకి ప్యూర్ ఈవీ

హైదరాబాద్, సెప్టెంబర్ 18: ప్రముఖ ద్విచక్ర ఈవీల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఐపీవోకి రావడానికి ప్రణాళికను వేగవంతం చేసినట్లు ప్యూర్ ఈవీ సీఈవో రోహిత్ వదేరా తెలిపారు. దేశీయంగా ద్విచక్ర వాహనాలను వాడేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నారని, వీరిని దృష్టిలో పెట్టుకొని సాంకేతిక పరంగా మార్పులు చేసి నయా ఈవీలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఐదేండ్లలో దేశీయ ద్విచక్ర వాహనాల విక్రయాల్లో 65 శాతం మార్కెట్ వాటా లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఇందుకోసం రిటైల్ అవుట్‌లెట్ల సంఖ్యను పెంచుకోవడంతోపాటు ప్లాంట్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకుంటున్నట్లు చెప్పారు. దీంతో కంపెనీ టర్నోవర్ రూ.2 వేల కోట్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈవీ రంగంలోకి అడుపెట్టి మూడేండ్లలోనే నిర్వహణ లాభాలు ఆర్జించిన సంస్థ తమదేనన్నారు. వచ్చే ఐదేండ్లలో 100 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. ఐఐటీ హైదరాబాద్‌తో ఇప్పటికే భాగస్వామ్యం కలిగివున్న సంస్థ..బ్రిటన్‌కు చెందిన కోవెంట్రీ ఇంజినీరింగ్ సంస్థతో జట్టుకట్టబోతున్నది.

# ఎన్‌పీఎస్ వాత్సల్య షురూ

- ప్రారంభించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- ఇక పిల్లల కోసం పెన్షన్ ఖాతాను తెరవనున్న తల్లిదండ్రులు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో భాగంగా వాత్సల్య పథకాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రారంభించారు. దీంతో పెన్షన్ అకౌంట్‌లో మదుపు చేయడం ద్వారా తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులకు పొదుపు చేసే అవకాశం దక్కుతున్నది. ఎన్‌పీఎస్ చాలా ఆకర్షణీయమైన రాబడులను అందిస్తుందని, పిల్లల కోసం పొదుపు చేసే చక్కని అవకాశం దీనిద్వారా తల్లిదండ్రులకు దొరికిందని మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు. అలాగే ఈక్విటీల్లో పెట్టుబడుల ద్వారా 14 శాతం, కార్పొరేట్ రుణాల నుంచి 9.1 శాతం, జీ-సెక్యూరిటీలతో 8.8 శాతం రాబడులను ఎన్‌పీఎస్ ఖాతాదారులు పొందారని చెప్పారు. కాగా, పిల్లల కోసం ఇప్పటికే ఉన్న ఎన్‌పీఎస్‌కు ఈ ఎన్‌పీఎస్ వాత్సల్య ఓ పొడిగింపు. ఈ ఎన్‌పీఎస్ అకౌంట్ల నుంచి ఉపసంహరణ కోసం మార్గదర్శకాలు సిద్ధం కావాల్సి ఉన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను జూలైలో పార్లమెంట్‌లో ప్రకటించిన బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ స్కీంను పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఈ స్కీం వివరాల్లోకి వెళితే..

- పోస్టాఫీస్ లేదా బ్యాంక్ శాఖల్ని సంప్రదించడం ద్వారా భౌతికంగా ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాను పిల్లల తల్లిదండ్రులు తెరుచుకోవచ్చు.
- ఆన్‌లైన్ ద్వారా కూడా ఎన్‌పీఎస్ వాత్సల్య అకౌంట్‌ను పొందవచ్చు.
- 18 ఏండ్ల దిగువన ఉన్న పిల్లల కోసం తల్లిదండ్రులు ఈ ఖాతాను ప్రారంభించవచ్చు. పిల్లలకు 18 ఏండ్లు దాటిన తర్వాత దానంతటదే ఈ ఖాతా రెగ్యులర్ ఎన్‌పీఎస్ అకౌంట్‌గా మారిపోతుంది.
- 60 ఏండ్లు నిండిన తర్వాతే ఖాతాదారునికి పెన్షన్ రావడం మొదలవుతుంది.
- ఏటా కనీస విరాళం రూ.1,000తో ఈ ఖాతాలను తెరుచుకోవచ్చు.
- గత పదేండ్లలో ఎన్‌పీఎస్‌కు 1.86 కోట్ల సబ్‌స్క్రైబర్లు తయారయ్యారు. దీని నిర్వహణ కిందనున్న ఆస్తులు రూ.13 లక్షల కోట్లు.
- ఎన్‌పీఎస్ వాత్సల్య ప్రారంభం కోసం పీఎఫ్ఆర్డీఏతో జట్టు కట్టిన బ్యాంకులు.

## బీవోఐ 'రుణవిముక్తి'

హైదరాబాద్, సెప్టెంబర్ 18: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ)... ఎన్‌పీఏ ఖాతాదారులకు శుభవార్తను అందించింది. తమ బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకునేందుకు ప్రత్యేకంగా 'సంఝౌతా కార్నివాల్(రుణ విముక్తి) ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తున్నది. రుణ గ్రహీతలు సరైన కారణాలతో వారి రుణాన్ని తిరిగి చెల్లింపుల్లో విఫలమైనవారికి ఈ నెల 21 వరకు మాత్రమే ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. ఈ సువర్ణావకాశాన్ని తమ శాఖను సంప్రదించి ఒకేసారి ఎన్‌పీఏ ఖాతాకు సంబంధించిన రుణాలను వెంటనే చెల్లించి మూసివేసుకోవచ్చునని సూచించింది.

## అరబిందో చేతికి జీఎల్ఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 18: అరబిందో ఫార్మా మరో ఔషధ సంస్థను కొనుగోలు చేసింది. ఇప్పటికే జీఎల్ఎస్ ఫార్మా లిమిటెడ్‌లో 51 శాతం వాటాను కొనుగోలు చేసిన సంస్థ..తాజాగా మరో 49 శాతం వాటాను చేజిక్కించుకున్నది. ఇందుకోసం రూ.22.5 కోట్ల నిధులు వెచ్చించింది. ఇందుకు సంబంధించి బుధవారం ఇరు సంస్థల మధ్య అధికారిక ఒప్పందం కుదిరింది. రూ.10 విలువ కలిగిన ప్రమోటర్లకు చెందిన 5,90,361 షేర్లను కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం డిసెంబర్ 31 నాటికి పూర్తికాగలదు.

# అర శాతం తగ్గిన ఫెడ్ వడ్డీరేటు

*నాలుగేండ్లలో ఇదే తొలిసారి • డిసెంబర్‌లో మరో అర శాతం కోత?*

*న్యూయార్క్, సెప్టెంబర్ 18: అందరూ అనుకున్నట్లే అగ్రరాజ్యం అమెరికా సెంట్రల్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకున్నది. పడిపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి, నిరుద్యోగాన్ని కట్టడి చేయడానికి ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను అర శాతం తగ్గించింది. 2020 తర్వాత వడ్డీరేట్లను తగ్గించడం ఇదే తొలిసారి కావడం విశేషం. దీంతో పాలసీ రేటు 5.25 శాతం నుంచి 5.50 శాతం స్థాయిలో ఉన్నది. కాగా, డిసెంబర్‌లోనూ మరో అర శాతం కోతకు అవకాశాలుంటాయన్న సంకేతాలిచ్చింది. దీర్ఘకాలికంగా ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడానికి, గడిచిన రెండేండ్లుగా అమెరికాలో జీవన వ్యయాలు అధికం కావడంతో సెంట్రల్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఫెడ్ నిర్ణయంతో అమెరికా స్టాక్ మార్కెట్లు ఆచితూచి స్పందించాయి. అరశాతం తగ్గించాలని 11 మంది ఫెడ్ గవర్నర్లు ఓటు వేయగా, కేవలం మైకేల్ బౌమెన్ పావు శాతం తగ్గించడానికి ఓటు వేశారు. ఈ నిర్ణయంతో ఇతర దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు కూడా వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు బంగారం ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 22 డాలర్లు ఎగబాకి 2,600 డాలర్ల పైకి చేరుకున్నది.*

# ఈ ఏడాదికైతే ఇంతే



### ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించేది వచ్చే ఏడాదే: సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: ఆహార ద్రవ్యోల్బణం దెబ్బకు రుణాలపై వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గకపోవచ్చని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అంచనా వేశారు. ఆర్బీఐ రాబోయే అక్టోబర్, డిసెంబర్ నెలల్లో చేపట్టే విధాన సమీక్షల్లోనూ కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచే వీలుందని తాజాగా అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలోనే ఈ ఏడాదికైతే ఇంతేనన్న ఆయన.. వచ్చే ఏడాదిలోనే వడ్డీరేట్ల కోతకు అవకాశాలున్నాయని చెప్పారు. వడ్డీరేట్లకు ఫెడ్ రిజర్వ్ తాజాగా అరశాతం కోతపెట్టిన నేపథ్యంలో ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులూ కోతలకు దిగే వీలున్నది. అయినప్పటికీ శెట్టి పైవిధంగా స్పందించడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. 'ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోత ప్రతీ సెంట్రల్ బ్యాంక్‌ను ప్రభావితం చేస్తుంది. కానీ ఆర్బీఐ మాత్రం ఆహార ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకొనే వడ్డీరేట్ల తగ్గింపుపై ఓ నిర్ణయానికి వస్తుంది' అని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అయితే వచ్చే ఫిబ్రవరిలో నిర్వహించే ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ రెపో రేటును తగ్గించే వీలుందని ఎస్బీఐ చీఫ్ అంచనా వేశారు. ఆహార ద్రవ్యోల్బణం అప్పటికి శాంతించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అక్టోబర్ 7-9 తేదీల్లో ఆర్బీఐ ద్రవ్యసమీక్ష ఉన్నది. ప్రస్తుతం రెపో రేటు 6.5 శాతం వద్ద ఉన్నది.

# సంక్షోభంలో వజ్ర పరిశ్రమ

### భారీగా పడిపోయిన ఎగుమతి-దిగుమతులు

### క్రమేణా మూతపడుతున్న కర్మాగారాలు

### దూరమవుతున్న ఉద్యోగాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 18: దేశీయ వజ్రాల తయారీ రంగం కుదేలైంది. గడిచిన మూడేండ్లుగా ఎగుమతులు-దిగుమతులు భారీగా పడిపోవడంతో తీవ్ర సంక్షోభాన్నే ఎదుర్కొంటున్నది. దీంతో కర్మాగారాలు మూతపడుతున్నాయి. ఈ పరిస్థితులు డైమండ్ ఇండస్ట్రీలో రుణ ఎగవేతలకు దారితీస్తున్నాయి. పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలూ దూరమైపోతున్నాయని బుధవారం గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) హెచ్చరించింది.

### ఇదీ సంగతి..

ల్యాబ్ ఆధారిత వజ్రాల తయారీ పరిశ్రమ నుంచి గట్టి పోటీ ఎదురవుతుండటంతో సహజసిద్ధమైన సానబెట్టని ముడి వజ్రాల నిల్వలు సంప్రదాయ పరిశ్రమల్లో భారీగా పేరుకుపోతున్నాయని, ఆర్డర్లు కూడా వీటికి తగ్గిపోయాయని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ అంటున్నారు. ఫలితంగా ఫ్యాక్టరీలు మూతబడి, ఉద్యోగులు రోడ్డునపడే దుస్థితి నెలకొందని చెప్పారు. భారతీయ డైమండ్ హబ్‌గా పేరొందిన ఒక్క గుజరాత్‌లోనే ఆర్థిక సమస్యలు తట్టుకోలేక ఇండస్ట్రీకి చెందిన 60 మందికిపైగా బలవన్మరణం పొందినట్టు గుర్తుచేశారు. ఇదిప్పుడు దేశీయ వజ్రాల పరిశ్రమ సంక్షోభానికి నిదర్శనంగా నిలుస్తున్నదన్నారు. తక్షణమే ఈ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారించాలని, అప్పుడే ఈ రంగానికి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు.

### అరకొర వ్యాపారం

2021-22లో దేశంలోకి ముడి వజ్రాల దిగుమతులు 18.5 బిలియన్ డాలర్ల మేర జరిగాయి. కానీ 2023-24లో ఇవి 14 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. అలాగే వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి వజ్రాలను ఆయా దేశాలు భారత్‌కు ప్రాసెసింగ్ కోసం తిరిగి ఎగుమతి చేస్తుంటాయి. ఉదాహరణకు బోట్స్‌వానా, అంగోలా, దక్షిణాఫ్రికా, రష్యాల నుంచి దుబాయ్ ముడి వజ్రాలను దిగుమతి చేసుకుంటున్నది. వాటిని మళ్లీ భారత్‌కు రీ-ఎక్స్‌పోర్ట్ చేస్తున్నది. ఇలా వస్తున్న వాటి విలువ కూడా 17.5 బిలియన్ డాలర్ల నుంచి 13.1 బిలియన్ డాలర్లకు క్షీణించింది. మార్కెట్‌లో పడిపోయిన వ్యాపార లావాదేవీలకు, డైమండ్ ప్రాసెసింగ్‌కు ఇది నిదర్శనంగా నిలుస్తున్నది. ఇక సానబెట్టిన, పాలీష్డ్ వజ్రాల ఎగుమతి 2021-22లో 24.4 బిలియన్ డాలర్లుగా ఉంటే.. 2023-24లో 13.1 బిలియన్ డాలర్లే. కేవలం రెండేండ్లలో 34.6 శాతం పతనం కనిపించింది. అంతేగాక ఈ వ్యవధిలో విదేశాల్లో అమ్ముడుపోక భారత్‌కు తిరిగొచ్చే వజ్రాల వాటా కూడా 35 శాతం నుంచి 45.6 శాతానికి ఎగిసింది.

### కీలక మార్కెట్లలో..

అమెరికా, చైనా, ఐరోపా దేశాల్లో నెలకొన్న ఆర్థిక మందగమన పరిస్థితులు, ద్రవ్యోల్బణం, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు కూడా భారతీయ వజ్రాల పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీశాయని ఈ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పాలీష్డ్ డైమండ్స్‌కు ఇక్కడ గిరాకీ బాగా తగ్గిందని చెప్తున్నారు. వజ్రాలు సహా ఇతర లగ్జరీ ఉత్పత్తుల కొనుగోళ్లకూ ఎవరూ పెద్దగా ఆసక్తి కనబర్చట్లేదని అంటున్నారు. ముఖ్యంగా ల్యాబ్ (ప్రయోగశాల)ల్లో తయారవుతున్న కృత్రిమ వజ్రాలు తక్కువ ధరకే లభిస్తుండటం కూడా సహజమైన వజ్రాలకు డిమాండ్‌ను తగ్గిస్తున్నది.



- సానబెట్టిన, పాలీష్డ్ వజ్రాల ఎగుమతిదారులకు ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ వ్యవధిని ఆర్బీఐ 6 నెలల నుంచి 12 నెలలకు పెంచాలని వజ్రాల పరిశ్రమ డిమాండ్ చేస్తున్నది.
- దేశీయ వజ్రాల పరిశ్రమలో 7 వేలకుపైగా కంపెనీలున్నాయి. వీటిలో వజ్రాల కటింగ్, పాలీషింగ్, ఎగుమతి కార్యకలాపాలు జరుగుతున్నాయి.
- సూరత్, ముంబైల్లోనే ఎక్కువగా ఈ పరిశ్రమలున్నాయి. వీటిలో చిన్న, మధ్యతరహావే ఎక్కువ. అలాగే కుటుంబ వ్యాపారాలే ఇండస్ట్రీలో అధికం.
- భారతీయ డైమండ్ ఇండస్ట్రీపై 13 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్క సూరత్‌లోనే దాదాపు 8 లక్షలకుపైగా ఉన్నారు.
- లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్ట్, రిటైల్, డైమండ్ టూల్ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాలకూ వజ్రాల పరిశ్రమ కీలకంగా ఉన్నది.